క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోవాలి

మొగుళ్లపల్లి: మండలంలోని కొర్కిశాల మోడల్ స్కూల్‌లో కెమిస్ట్రీ బోధించేందుకు పోస్టు ఖాళీగా ఉందని అర్హులైనవారు ఈనెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ తాళ్లపల్లి రాకేశ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు గంటల ప్రాతిపదికన బోధించేందుకు పీజీ బీఎడ్ అర్హతలు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని, ఉదయం 10గంటలకు డెమో ఉంటుందని తెలిపారు.

కేజీబీవీలో సీట్లకు..

కాటారం: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల ఆశ్రమ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశం కోసం ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారిణి చల్ల సునీత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బైపీసీలో 10 సీట్లు, ఎంపీసీలో 20 సీట్లు, 6వ తరగతిలో 10 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్ ద్వారా భర్తీ చేయనున్నట్లు వివరించారు.

వీధి దీపాల అందజేత

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి గ్రామాభివృద్ధి కోసం గ్రామానికి చెందిన బజ్జూరి వెంకటేశ్వర్లు సుమారు రూ.32000 విలువ గల వీధి దీపాలను ఆదివారం అందించారు. మొట్లపల్లి గ్రామంలో జన్మించి, హైదరాబాద్‌లో స్థిరపడి గ్రామం మీద మమకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న వెంకటేశ్వర్లును గ్రామస్తులు అభినందించారు.

పరామర్శ



పరామర్శిస్తున్న పుట్ట మధు

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామంలో జక్కమ్మ, ఎండీ అలిమ్, ఓదేలు, పెద్దతూండ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని కిషన్‌రావుపల్లిలో రామయ్య, గాదంపల్లిలో భూదమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను ఆదివారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టేకుమట్ల: పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ తండ్రి ఐలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మండలంలోని రాఘవరెడ్డిపేట, ఆరెపల్లి గ్రామానికి చెందిన గజ్జి కృష్ణ స్నేహితులు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో పరామర్శించారు. కుర్రె మల్లయ్య, తుమ్మేటి సురేందర్ రెడ్డి, పోతుగంటి వసంతరావు, గువ్వాడి శివ, కోండ్ర రమేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

'కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు లేదు'

ఆత్మకూరు : కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్ అన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో ఆదివారం జరిగిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి గ్రామాల అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజల చేతిలో గుణపాఠం తప్పదన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూపి ఓర్వలేక బీఆర్‌ఎస్ పార్టీ విమర్శలు చేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాధిక, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల కల నెరవేరిన వేళ..

- నేడు కొత్తపల్లిగోరిలో పోలీస్‌స్టేషన్ ప్రారంభం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు

రేగొండ: కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ హోంశాఖ ముఖ్య కార్యదర్శి గత నెల 19న నోటిఫికేషన్ జారీ చేశారు. కాగా మండల కేంద్రంలో తాత్కాలిక భవనంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి నేడు (సోమవారం) మంత్రుల బృందంతో ప్రారంభించనున్నారు.

నూతన మండలంగా ఏర్పాటు..

ఘన చరిత్ర కలిగిన కొత్తపల్లిగోరి మండలంగా 2023 జూన్ 28న ఆవిర్భవించింది. గత ప్రభుత్వంలో తాత్కాలిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.3.20 కోట్లతో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయ భవన నిర్మాణాలను చేపట్టారు. కాగా, నూతన పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి నిధులు మంజూరు కానుండడంతో పూర్తి స్థాయిలో ప్రభుత్వ శాఖల కార్యాలయాలు దశల వారీగా రానున్నాయి. ఈ భవనాల నిర్మాణానికి గోరి సాబ్ భూములను గుర్తించి సర్వే నిర్వహించాలని తహసీల్దార్ లక్ష్మీరాజయ్యకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచించారు. ప్రభుత్వ భవనాల ఏర్పాటు కోసం గోరి సాబ్ వారసులు కూడా భూమిని ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది.



నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్‌స్టేషన్

విధుల్లో 18 మంది సిబ్బంది

దశాబ్దాల క్రితం కొత్తపల్లిగోరి కేంద్రంగా పోలీస్ స్టేషన్‌ను ఉండేది. కానీ అది తర్వాత శాయంపేటకు తరలిపోయింది. 2023లో కొత్తపల్లిగోరి మండలం ఏర్పాటు కాగా గత ప్రభుత్వంలో పోలీస్‌స్టేషన్ మంజూరు కాలేదు. ప్రస్తుతం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చేసిన ప్రతిపాదన మేరకు కొత్తపల్లిగోరి మండలానికి పోలీస్‌స్టేషన్ మంజూరు చేశారు. తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేసిన పోలీస్‌స్టేషన్‌కు 18 మంది సిబ్బంది కేటాయించారు. ఒక ఎస్సై, ఒక ఏఎస్సై, నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, ముగ్గురు మహిళా కానిస్టేబుళ్లు, తొమ్మిది మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తించనున్నారు. దీంతో తమ కల సాకారమైందని మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ఉంది



నా చిన్నతనంలో కొత్తపల్లి గోరిలో పోలీస్‌స్టేషన్ ఉండేది. తరువాత శాయంపేటకు తరలించారు. మళ్లీ ఎన్నో ఏళ్ల తరువాత కొత్తపల్లిగోరి కేంద్రంగా పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది.

– కట్లసాంబయ్య, గ్రామస్తుడు, కొత్తపల్లిగోరి

ఎమ్మెల్యే చొరవతోనే..



కొత్తపల్లిగోరిలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కోసం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే మండల కేంద్రంలో ఇతర కార్యాలయాలతోపాటు, పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసి, దశాబ్దాల కల నెరవేర్చిన ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– ఓంప్రకాశ్, మాజీ సర్పంచ్, కొత్తపల్లిగోరి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల అధ్యక్షుడు చిటమట రఘు మండల కేంద్రంలో ఆదివారం అందజేశారు. 12 మంది లబ్ధిదారులకు రూ.3.64 లక్షల విలువ చేసే చెక్కులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖలీల్, గుడ్ల దేవేందర్, ముక్కెర లాలయ్య, చెన్నూరి బాలరాజు, వావిలాల ఎల్లయ్య, సులేమాన్, నవీన్, బండారి లక్కి, మడుగూరి ప్రసాద్, సిరాజ్, కర్ల తరుణ్, ఉమ్మనేని రమేష్, సంతోష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



భూపాలపల్లి రూరల్: నగదు అందిస్తున్న మిత్రులు



చిట్యాల: ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలం గొర్లవీడు గ్రామానికి చెందిన దోమల దేవేందర్ గొంతు కేన్సర్‌తో బాధపడుతున్నాడు. దీంతో ఆపరేషన్ ఖర్చుల కోసం దేవేందర్‌కు అతడితో కలిసి 2007–08లో పదో తరగతి చదువుకున్న చిన్ననాటి మిత్రులు ఆదివారం రూ.22000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీణవంక సంపూర్ణ చారి, అంకం సురేశ్, మామిడి సంతోష్, చిట్టింపెల్లి రాకేశ్, రవి, బుర్ర సంపత్, అఫ్రోజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని గోపాలపూర్ గ్రామానికి చెందిన కంకణాల రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం పరామర్శించారు. అనంతరం 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీతో పాటు రూ.8వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు కాట్రేవుల కుమార్, మండల యూత్ ప్రధాన కార్యదర్శి రఘు, గ్రామ శాఖ అధ్యక్షుడు కొండ కృష్ణ, గ్రామ యూత్ అధ్యక్షుడు అంబాల రాజు, గ్రామస్తులు భాస్కర్, రాజు, మహేందర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

తాటివనంలో సోలార్ వెలుగులు

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామంలో గల తాటివనంలో సోలార్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. రాత్రి సమయంలో గీతకార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలను గమనించిన గ్రామానికి చెందిన మాజీ కోఆప్షన్ సభ్యుడు వైనాల రాజేందర్ సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. కాగా మాజీ జేడ్పీటీసీ వంగాల నారాయణరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ.. గీతకార్మికులు రాత్రి సమయంలో పడుతున్న కష్టాలను చూసి సోలార్ లైట్లను ఏర్పాటు చేసిన రాజేందర్‌ను అభినందిస్తున్నట్లు చెప్పారు. గ్రామ ప్రజలకు సేవ చేసేందుకు యువత ముందుకు రావడం శుభసూచికమన్నారు. గ్రామ గౌడ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

కన్నాయిగూడెం : మండలంలోని గూర్రేవుల జిల్లా పరిషత్ పాఠశాలలో స్కావెంజర్ల జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శ్రీరాముల లక్ష్మి, ఉపాధ్యక్షులుగా సమ్మెట రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా అల్లెం అనిత ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. స్కావెంజర్స్‌గా పాఠశాలల్లో పనిచేస్తున్న వారిని రిజిస్టర్‌లో నమోదు చేసి వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్, సమ్మయ్య, తిరుమల, బానక్క, కృష్ణవేణితో పాటు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ..



ఎన్నికైన కమిటీ సభ్యులు

ములుగు రూరల్: మండల పరిధిలోని జగ్గన్నపేటలో మహిళా కాంగ్రెస్ గ్రామ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా వంక కాంతమ్మ, ప్రధాన కార్యదర్శిగా సరస్వతి, కార్యదర్శులుగా దేవిరెడ్డి, జయలక్ష్మి, ఉపాధ్యక్షురాలుగా రౌతు రమణ, కోశాధికారిగా గణగం రజిత, అధికార ప్రతినిధిగా వీరమ్మను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు పావని, పిట్టల రాధిక, సంధ్య తదితరులు ఉన్నారు.

నియామకం

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని తొమ్మిదో వార్డు హైటెక్ కాలనీ నూతన కమిటీని ఆదివారం నియమించారు. ఈ మేరకు కాలనీ పెద్దలు తూడి భాస్కర్ రెడ్డి, పిన్నింటి శ్రీనివాసరావు కమిటీ వివరాలు వెల్లడించారు. అధ్యక్షుడిగా క్యాతం సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా బొమ్మకంటి పవన్ కుమార్, గౌరవ అధ్యక్షులుగా సామల లక్ష్మారెడ్డి, సాదు సదానందం, ఉపాధ్యక్షులుగా మహేష్, రామారావు, కార్యదర్శిగా చల్ల రవీందర్‌రెడ్డి, గోపతి రాజు, రాగుల కనకయ్య, సట్ల సరేష్, కోశాధికారిగా పసునూటి సుమన్, గండు శ్రీధర్‌తో పాటు పలువురి సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల గ్రామానికి చెందిన ఓ యువతి గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆదివారం కుటుంబ సభ్యులు లేని సమయంలో పత్తిచేను వద్ద ఉన్న గడ్డిమందు తాగి కనిపించింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే మహదేవపూర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. యువతికి మతిస్థిమితం లేదని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ: అర్హులందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం మండలంలోని దమ్మన్నపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి, పలువురి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదవాడి సొంత ఇంటి కలను నిజం చేయడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పార్టీలకు అతీతంగా పేదలకు ఇళ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ నడిపల్లి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు నాయినేని సంపత్ రావు, నడిపల్లి శ్రీనివాసరావు, ఐలి శ్రీధర్, గండి తిరుపతి, ఏనుగు రవీందర్ రెడ్డి, కోయిల క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్'ను నిలిపేయాలి

కాటారం: దండకారణ్యంలో ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసీలపై జరుగుతున్న దాడులను వెంటనే నిలిపేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక నాయకులు ముడిమడుగుల మల్లన్న, దాముక లక్ష్మణ్, పీక కిరణ్ డిమాండ్ చేశారు. ఆదివాసీలపై దాడులకు వ్యతిరేకంగా ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 27న మండల కేంద్రంలో నిర్వహించనున్న బహిరంగసభకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడవులలోని కొట్లాది అటవీ, ఖనిజా సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి ఆదివాసీలను అడవుల నుంచి వెళ్లగొట్టడానికి ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. అందులో భాగంగానే ఆపరేషన్ జనజాగరన్ అభియాన్, సల్వాజూడుం, గ్రీన్‌హంట్, ఆపరేషన్ సమాధాన్, ఆపరేషన్ అనకొండ, ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై దాడులు కొనసాగిస్తుందని విమర్శించారు. రత్నకుమార్, రాజయ్య, కొమురయ్య, బాపు, ఐత బాపు, లెనిన్, సుంకరి మల్లేశ్, పోలం రాజేందర్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

దివ్యాంగుల పింఛన్లు పెంచాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల చంద్రమౌళి

టేకుమట్ల: దివ్యాంగుల పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల చంద్రమౌళి అన్నారు. మండల కేంద్రంలోని పీఎంఆర్ఎం కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం దివ్యాంగుల మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అంబుల కుమార్, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి, ఉపాధ్యక్షులుగా పోతుగంటి కుమార్, పాంద్రాల రాజయ్య, సహాయ కార్యదర్శులుగా మాచర్ల ఓదెలు, కానుగంటి మహేందర్, కోశాధికారిగా కాసాని మల్లయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల చంద్రమౌళి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం పింఛన్లు పెంచాలని పెంచాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 13న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన దివ్యాంగుల మహాగర్జన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు మహాగర్జన విజయవంతం కోసం ఈ నెల 25న జిల్లా కేంద్రంలో నిర్వహించే సన్నాహక సభకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రేనుకుంట్ల శంకర్, నాయకులు పాల్గొన్నారు.



నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాదు రాకేశ్

ఏటూరునాగారం: ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాదు రాకేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యారంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 23న విద్యాసంస్థల బంద్‌ను చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాల కారణంగా అధికారాన్ని కోల్పోయిందని, గత ప్రభుత్వం చేసిన తప్పిదాలే ఈ ప్రభుత్వం చేస్తోందన్నారు. ప్రభుత్వం ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ విచ్చలవిడిగా ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతులిస్తూ పేద, మధ్య తరగతి విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్రకు తెరలేపిందన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన అందిస్తామని అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కార్ రెండు సంవత్సరాలు కావొస్తున్న ఇప్పటి వరకు పెండింగ్ బకాయిలను విడుదల చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బట్టు స్వామి, ప్రవీణ్, రాకేష్, ధనూష్, బాలు, సాంబశివరావు, సాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాదు రాకేశ్

అదుపు తప్పి రోడ్డు దిగిన కంటైనర్

వాజేడు : మండల పరిధిలోని లొట్టిపిట్ట గండి సమీపంలో బీరమయ్య గుట్టపై ఛత్తీస్‌గఢ్ నుంచి వస్తున్న కంటైనర్ అదుపు తప్పి రోడ్డు కిందికి దిగిపోయిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని టేకులగూడెం సరిహద్దులో ఉన్న లొట్టిపిట్ట గండి వద్ద ఛత్తీస్‌గఢ్ నుంచి ఐరన్ లోడుతో వస్తున్న కంటైనర్ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పి రోడ్డు కిందికి దిగిపోయింది. లోయలో పడే సమయంలో చెట్టుకు తగిలి ఆగడంతో తృటిలో భారీ ప్రమాదం తప్పింది. డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.



ప్రమాదానికి గురైన కంటైనర్

బస్సులు రావు.. బాధలు తీరవు

- 20 రోజులుగా నిలిచిన ఆర్టీసీ బస్సు సర్వీస్
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

వెంకటాపురం(కె): మండల కేంద్రం నుంచి మండలంలోని ఎదిర పంచాయతీ వరకు 20 రోజులకు పైగా ఆర్టీసీ బస్సులు రావడం లేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నుంచి మండల కేంద్రానికి బస్సు సర్వీసులు నడిచేవి. కాగా, ఎదిర పంచాయతీ రాళ్లవాగు సమీపంలో బ్రిడ్జి పిల్లర్లు కుంగిపోవటంతో రాళ్లవాగులో తాత్కాలిక రోడ్డును నిర్మించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు బురదమయం కావడంతో ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీస్‌లు నిలిపేశారు. దీంతో ఎదిర నుంచి మండల కేంద్రం వరకు ప్రజలు రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



బస్సులు లేక ఆటో ఎక్కుతున్న ప్రజలు

ప్రైవేట్ వాహనాలే దిక్కు

ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీస్‌లు నిలిపి వేయడంతో మండల ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ప్రమాదం అని తెలిసిన ఆటోలలో ఓవర్ లోడ్‌తో ప్రయాణించక తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టి ఆర్టీసీ బస్సు సేవలను పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బస్సు సర్వీసులు నడపాలి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఆర్టీసీ అధికారులు మండలానికి బస్సు సర్వీస్‌ను నిలిపివేశారు. అధికారులు స్పందించి బస్సు సర్వీస్ తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. బస్సులు లేక పోవడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– చిట్టెం ఆదినారాయణ, వెంకటాపురం(కె)

ఇబ్బందులు పడుతున్నాం..



20 రోజులుగా మండలానికి భద్రాచలం డిపో నుంచి బస్సు సర్వీసులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రైవేటు వాహనాలకు అధికంగా అవుతున్నా ప్రయాణించక తప్పడం లేదు.

– ముత్తినేని అనూష, వెంకటాపురం(కె)

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

ఏటూరు నాగారం: మద్యం తాగి వాహనాలు నడపొద్దని ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వై జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలతో పాటు బ్రీత్ ఎనలైజర్‌తో వాహనదారులను పరీక్షించారు. ఆర్‌టీఏ నిబంధనలను పాటిస్తూ వాహనాలను నడపాలని కోరారు. ఆయనతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.



బ్రీత్‌ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న పోలీసులు